భూ భారతి చట్టం-2025 ద్వారా

# భూ సమస్యలు పరిష్కారం


- రైతుల చప్పట్లతో మొదలైన భూ భారతి చట్టం అవగాహన సదస్సు
- జిల్లా కలెక్టర్ తెజస్ నంద్ లాల్ పవార్



**గరిడేపల్లి నవభూమి** భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.గురువారం హుజూర్ నగర్ డివిజన్ పరిధిలోని గరిడేపల్లి మండల కేంద్రంలోని రామకోటయ్య పంక్షన్ హాల్ లో భూ భారతి చట్టం 2025 పై అవగాహన సదస్సు కార్యక్రమం లో జిల్లా ఎస్పి నరసింహ తో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ గారి జయంతి రోజున భూ భారతి చట్టం అమలులోనికి తీసుకొని రావటం జరిగిందని తదుపరి రాష్ట్ర స్థాయి లో, జిల్లా స్థాయి లో రెవిన్యూ సిబ్బందికి అవగాహన కల్పించటం జరిగిందని ఇప్పుడు మండల స్థాయి లో ప్రజలకి చట్టం పై అవగాహన తెచ్చేందుకు 23 మండలాలలో ప్రజలకి సమస్యలు ఎలా పరిష్కరించాలో అవగాహన సదస్సు లు నిర్వహిస్తామని పేర్కొన్నారు.ధరణిలో చాలా సమస్యలు పరిష్కరించలేనివి ఉన్నాయని ప్రతి సమస్య కలెక్టర్ ద్వారా గానీ కోర్టు ద్వారా గానీ పరిష్కరించే విధంగా ఉండేదని ప్రతి ఒక్కరు గ్రామం నుండి సూర్యాపేట వచ్చి సమస్య పై దరఖాస్తు ఇవ్వాలంటే ప్రజలకి చాలా ఇబ్బందిగా ఉండేదని కానీ భూ భారతి చట్టం ద్వారా అధికారం వికేంద్రికరణ జరుగుతుందని సమస్యని బట్టి తహసీల్దార్, ఆర్ డి ఓ, కలెక్టర్ స్థాయి లో పరిష్కరించవచ్చు అని త్వరలో గ్రామ స్థాయి లో భూ సమస్యలు పరిష్కరించేందుకు గ్రామ పరిపాలన అధికారి (జి పి ఓ) నియమించబోతున్నారని తెలిపారు.భూ భారతి చట్టం ఏప్రియల్ 14 న ప్రారంభించి నాలుగు మండలాలలో పైలెట్ ప్రాజెక్ట్ కింద అమలు జరుగుతుందని తదుపరి ప్రతి జిల్లాలో ఒక్క మండలంలో అమలు చేస్తారని అక్కడ ఏమైనా సమస్యలు పరిస్కారం కాకపోతే భూ భారతి చట్టంలో మార్పులు తెచ్చి భూ సమస్యలు తీర్చుతారని తదుపరి జూన్ 2 నుండి రాష్ట్ర వ్యాప్తంగా భూ భారతి చట్టం అమలు జరుగుతుందని తెలిపారు.భూమిని తమ కుటుంబ సభ్యులుగా భావిస్తారని చాలా మందికి బ్రతకడానికి భూమినే ఆధారం ఆ భూమి తమదని నిరూపించు కునేందుకు పట్టాదారు పాస్ బుక్ ఉండాలని భూ భారతి చట్టం ద్వారా 13 (బి) లకు పాస్ బుక్ నందు అలాగే 2020 అక్టోబర్ లో ధరఖాస్తు చేసుకున్న సాధాబైనమా ధరఖాస్తులు పరిశీలించి వాటిని పట్టాదార్ పాస్ బుక్ నందు అప్డేట్ చేస్తమని ఈ అవకాశం ధరణిలో లేదు అని తెలిపారు.గరిడేపల్లి మండలం లో సాగర్ ఎడమ కాల్వల ద్వారా నీరు పారించి అత్యధికంగా వరి పడించి నాణ్యమైన బియ్యం తయారు అవుతుందని చాలా మంది చదువుకొని ఉన్నత స్థితిలో ఉన్నారని మొదటి సదస్సు గరిడేపల్లి మండలంలో ప్రారంభించటం చాలా సంతోషగా ఉందని రైతులు కూడా చాలా ఎక్కువ మంది రావటంతో సదస్సు విజయవంతం అయిందని తెలిపారు.భూ భారతి చట్టం అమలులో భాగంగా వారసత్వం /పౌతి అమలు చేసేటప్పుడు గ్రామం లో నోటీసులు ఇచ్చి వారం గడువు ఇస్తామని ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపవచ్చు అని ఈ అవకాశం ధరణి లో లేదని తెలిపారు.ప్రతి సంవత్సరం డిసెంబర్ 31 న ప్రతి గ్రామంలో ప్రతి రైతు కి 1 బి అందజేస్తామని ఏమైనా తప్పులు ఉంటే సరి చేస్తామని తెలిపారు.భూమిలకు ఆధార్ వల్లే భూధార్ అనే యూనిక్యూ నెంబర్ ఇచ్చి ప్రతి భూమికి సరిహద్దులు నిర్ణయించి సర్వే మ్యాప్ ని భూ భారతి పోర్టల్ లో అప్డేట్ చేస్తామని తదుపరి ప్రజలు పోర్టల్ నుండి డౌన్లోడ్ చేసుకోవచ్చు అని తెలి పారు.రాబోయే రోజులలో భూ సమస్యలు పరిష్కరించేందుకు రెవిన్యూ అధికారులు కృషి చేస్తారని తెలిపారు.సెక్షన్ ల వారీగా భూ భారతి చట్టం పై పిపిటి ద్వారా ప్రజలకి కలెక్టర్ వివరించారు.సదస్సుకు వచ్చిన రైతులు నూతన చట్టం పట్ల తమ హర్షం చప్పట్లతో వేలుబుచ్చారు. తమ భూ సమస్యలు పూర్తిగా పరిష్కారం అవుతాయనె నమ్మకం కలుగుతుందన్నారు





# నవభూమి

## నల్లగొండ

అనుబంధం

18 ఏప్రిల్,2025 శుక్రవారం పేజీలు:4

www.epaper.navabhoomi.in


గంజాయి డ్రగ్స్ నివారించడం కోసం జిల్లాలో ప్రత్యేక

# బృందాలను కేటాయించాలి

- ధర్మారెడ్డి పల్లికి చేరుకున్న డివైఎఫ్ఐ సైకిల్ యాత్ర



**భూదాన్ పోచంపల్లి నవభూమి ప్రతినిధి ఏప్రిల్ 17** యాదాద్రి భువనగిరి జిల్లాలో వందల కోట్ల విలువ చేసే డ్రగ్స్ గంజాయి పట్టుబడుతున్న అధికారులు మాత్రం తాత్కాలికంగాచర్యలు తప్ప దీర్ఘకాలిక చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని దీనిపై ప్రత్యేకమైన బృందాలను ఏర్పాటు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పల్లె మధుకృష్ణ, గడ్డం వెంకటేష్ డిమాండ్ చేశారు.మండలంలోని ధర్మారెడ్డి పల్లి గ్రామానికి గురువారం యువ చైతన్య సైకిల్ యాత్ర చేరుకున్న సందర్భంగా వారు మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాలో అనేక పరిశ్రమలు ఉన్న పరిశ్రమలలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించకపోవడం అదేవిధంగా యువతను డ్రగ్స్ గంజాయి బారి నుండి దూరం చేసే ప్రయత్నాలు చేయకపోవడం జిల్లాలో రోజురోజుకు వందల కోట్ల విలువ చేసే గంజాయి పట్టుబడుతున్న అధికార యంత్రాంగం నుండి ఎలాంటి అటుదిట్టమైన చర్యలు లేవని వారు అన్నారు. జిల్లా నుండి ఇంత విలువచేసే డ్రగ్స్ గంజాయి తరలిపోతున్న పోలీసు యంత్రాంగం నిగా బలగాలను పెంచి ఎక్కడికి అక్కడ తనిఖీలు చేయాలని వారు సూచన చేశారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి డ్రగ్స్ గంజాయిని ఎప్పటికప్పుడు నిర్మూలించకపోతే అనేకమంది యువత వారి జీవితాలు నాశనం అవుతాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు .వీరితో పాటు జిల్లా సహాయ కార్యదర్శి కవిడే సురేష్, జిల్లా కమిటీ సభ్యులు దుబ్బాక జగన్, బండారు శ్రవణ్, ఎండి సోహెల్, సిఐటియు మండల కన్వీనర్ మంచాల మధు, ఎస్ఎఫ్ఐ చౌటుప్పల్ మండల కార్యదర్శి తీగుళ్ల శ్రీనివాస్, హర్షవర్ధన్ రెడ్డి, చుక్క రజినీకాంత్, వంగూరి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# 2 రోజులకో సారి సమీక్ష



# తోటల, కూరగాయల సాగుకు సబ్సిడీని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

## హార్టికల్చర్ ఆఫీసర్ నసీమా



**మిర్యాలగూడ నవభూమి ఏప్రిల్ 17:-** పండ్ల తోటల, కూరగాయల పంటల సాగుపై ఉద్యానవన శాఖ అందించే సబ్సిడీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మిర్యాలగూడ డివిజన్ హార్టికల్చర్ ఆఫీసర్ ఎస్కే నసీమా మెహ్రీన్ కోరారు. గురువారం మిర్యాలగూడ మండలం కిష్టాపురం గ్రామంలో కే. వెంకట్ రెడ్డి కూరగాయల తోటను సందర్శించి సస్య రక్షణ సూచనలు చేసిన అనంతరం మాట్లాడుతూ తోటలు పెంచే ఎస్సి, ఎస్టీ రైతులకు ఉద్యానవనశాఖ వంద శాతం, బిసి రైతులకు 80 శాతం, సామాన్య రైతులకు 50 శాతం సబ్సిడీ పై, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు అంద జేస్తున్నట్లు తెలిపారు. పందిరి కూరగాయల సాగులో అంతర పంటగా ఆకుకూరలు వేసుకుని లబ్ధి పొందవచ్చని ఆమె తెలిపారు. అధిక దిగుబడి సాధించేలా ఎరువుల యాజమాన్యం, వేసవిలో సాగు నీరు ఏ విధంగా అందించాలో సూచనలు చేశారు. మల్చింగ్, డ్రిప్ ద్వారా కలుపు నివారణ, మొక్కలకు నీరందేలా చేయాల్సిన పనులు సూచించారు. డ్రిప్, బిందు సేద్యంకు 90 శాతం, మల్చింగ్ కు 50 శాతం సబ్సిడీ ఉందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# చిరుధాన్యాల వినియోగంతో సంపూర్ణ ఆరోగ్యం

## ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ రేఖల మమత

**మిర్యాలగూడ నవభూమి, ఏప్రిల్ 17:-** చిరుధాన్యాలు వినియోగంతో మానవాళి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండగలుగుతారని ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ రేఖల మమత అన్నారు. ఐసీడీఎస్ మిర్యాలగూడ అర్బన్ ప్రాజెక్ట్ పరిధి చిల్లాపురం సెక్టార్ పరిధిలోనీ తుంగపాడు అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమాన్ని గురువారం షెడ్యూల్ ప్రకారం సీడీపీఓ మమత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలకు లబ్ధిదారులకు వివిధ రకాల పౌష్టికాహార ప్రాముఖ్యతను వివరించారు. అదేవిధంగా పరిసర ప్రాంతాలలో చౌకగా లభించే చిరుధాన్యాలను ఉపయోగించి ఆరోగ్యకర ఆహార పదార్థాలను తీసుకోవాలని, ఆహార భద్రత పాటించవలెనని చెప్పడం జరిగింది. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని,తల్లులకు అవగాహన కల్పించారు. పౌష్టికాహార ప్రాముఖ్యతను వివరిస్తూ గర్భిణీలు, బాలింతలు తగు ఆహార నియమాలు పాటిస్తూ, సమతుల ఆహారాన్ని తీసుకుంటూ రోజువారీ జీవితంలో చిరుధాన్యాలను ఒక భాగంగా చేసుకోవాలని వివరించారు. అదేవిధంగా గర్భిణీలు, బాలింతలు కూల్ డ్రింక్స్ లాంటివి తీసుకోకూడదని, పిల్లలకు జంక్ ఫుడ్స్ తినే అలవాటు మాన్పించాలని, వాటి వలన కలిగే నష్టాలను వివరించారు. అదేవిధంగా రోజువారీ నిత్య జీవితంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, అధిక ప్లాస్టిక్ వినియోగం వలన కాన్సర్ తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని తగు జాగ్రత్తలు పాటించాలని అవగాహన కల్పించారు.కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ ఆర్.వాణి,ఎంపిహెచ్వి రూపశ్రీ,ప్రైమరీ స్కూల్ హెడ్ మాస్టర్ రాగ్యానాయక్,హెల్త్ సూపర్వైజర్ మంగమ్మ, బ్లాక్ కో ఆర్డినేటర్ కవిత,ఎంపిహెచ్ లు జయరాణి, ఎస్కే.రెహనా ఆశా కార్యకర్తలు పేరమ్మ, జ్యోతి, పద్మ, అంగన్వాడీ టీచర్స్ ప్రమీల, నాగమ్మ, హెల్పర్స్,గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు, లబ్ధిదారులు, మహిళలు పాల్గొన్నారు.





# సత్వర న్యాయానికే నూతన కోర్టుల ఏర్పాటు

## హైకోర్టు న్యాయమూర్తి రాధారాణి

**హుజూర్‌నగర్, ఏప్రిల్ 17 :** కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకే నూతన కోర్టులు ఏర్పాటు చేస్తున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి, సూర్యాపేట జిల్లా పోర్టు పోలియో జడ్జి రాధారాణి తెలిపారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు నూతనంగా మంజూరైన అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టును గురువారం హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వినోద్ కుమార్, జస్టిస్ లక్ష్మణ్, జస్టిస్ సుజనతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హుజూర్‌నగర్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలో పెండింగ్ కేసుల సంఖ్య అధికంగా ఉందని ఈ కేసుల పరిష్కారానికి నూతన కోర్టు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. నూతన కోర్టుల సముదాయాన్ని, అలాగే న్యాయమూర్తుల వసతి గృహాల నిర్మాణాల కోసం బార్ అసోసియేషన్ సభ్యులు రాంరెడ్డి ఆధ్వర్యంలో నిరంతరం కృషి చేసి ప్రభుత్వం నుండి నాలుగు ఎకరాల స్థలాన్ని కేటాయింపు చేసుకోవడం సంతోషకరమన్నారు.హైకోర్టు జస్టిస్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. హుజూర్‌నగర్ న్యాయవాదుల చిరకాల వాంఛ ఈ నూతన కోర్టు ప్రారంభోత్సవంతో నెరవేరినట్లుగా భావిస్తున్నానన్నారు. పాలకవీడు, మఠంపల్లి, మేళ్లచెరువు, చింతలపాలెం పోలీస్ స్టేషన్ల పరిధిలోని క్రిమినల్ కేసులు ఆయా మండలాల లోని సివిల్ కేసులు మొత్తం 3,067 కేసులను నూతన కోర్టుకు కేటాయించినట్లు చెప్పారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడి విన్నపం మేరకు త్వరలోనే నూతన కోర్టుకు న్యాయమూర్తిని కేటాయించడానికి ప్రయత్నిస్తానని ఆయన హామీ ఇచ్చారు.జస్టిస్ సుజన మాట్లాడుతూ.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా 8 వేల కేసులు మాత్రమే పెండింగ్ లో ఉండగా ఒక్క హుజూర్‌నగర్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 8,500 కేసులు పెండింగ్‌లో ఉండడం ఆశ్చర్యపరిచిందన్నారు. పెండింగ్ కేసుల భారాన్ని పరిగణలోకి తీసుకుని బార్ అసోసియేషన్ విన్నపం మేరకు నూతన కోర్టును మంజూరు చేశామన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రాంరెడ్డి మాట్లాడుతూ.. న్యాయమూర్తుల వసతి గృహాల నిర్మాణానికి హైకోర్టు న్యాయమూర్తులు అనుమతులు జారీ చేయాలని అలాగే నూతన కోర్టుకు



సాధ్యమైనంత త్వరలో న్యాయమూర్తిని కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు.సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ శ్యామ్ శ్రీ మాట్లాడుతూ హుజూర్‌నగర్ న్యాయవాదుల అభ్యర్థన మేరకు అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టును మంజూరు చేయడం పట్ల హైకోర్టు న్యాయమూర్తులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ శ్యామ్ శ్రీ తో పాటు పలువురు న్యాయమూర్తులను గజమాలలు, శాలువాలు, బొకేలతో ఘనంగా సత్కరించి వారికి మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ, హుజూర్ నగర్, కోదాడ, సూర్యాపేట సీనియర్ సివిల్ జడ్జీలు జిట్టా శ్యామ్ కుమార్, సురేశ్, పర్వీన్ కౌసర్, జూనియర్ సివిల్ జడ్జి భవ్య శ్రీ పాల్గొన్నారు.

# ప్రజలంతా బీఆర్ఎస్ వైపే..

**కొండమల్లేపల్లి, ఏప్రిల్ 16 :** రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు బీఆర్ఎస్ పార్టీ వైపే ఉన్నారని, తిరిగి కేసీఆర్‌ను సీఎం చేసేందుకు సిద్ధమవుతున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభ నేపథ్యంలో దేవరకొండ పట్టణంలోని విష్ణు కాంప్లెక్స్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నియోజకవర్గ ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యమ నాయకుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక్కరితో మొదలై నేడు లక్షలాది మంది ప్రజాభిమాన్ని చూరగొన్న పార్టీ బీఆర్ఎస్ అన్నారు. సీఎంగా కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు దేశంలోనే చరిత్ర సృష్టించాయని గుర్తుచేశారు. కేసీఆర్ పదేండ్ల పాలన స్వర్గయుగమంటూ ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారని తెలిపారు.ఊళ్లల్లో పచ్చని చెట్లను చూస్తే హరితహారం గుర్తుకు వస్తుందని, తాగే నీటిలో మిషన్ భగీరథ పథకం తీసుకొచ్చిన కేసీఆర్ కనిపిస్తారని పేర్కొన్నారు. తెలంగాణలో ఆయన ఆనవాళ్లను చెరిపేయడం రేవంత్‌రెడ్డి తరం కాదని తెలిపారు. హింసకు తావు లేకుండా, రాజ్యాంగ బద్ధంగా తెలంగాణ రాష్ట్రం సాధించిన కేసీఆర్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం నిర్మాణాత్మక పాలన అందిస్తే.. రేవంత్‌రెడ్డి పాలన దుర్మార్గంగా, రాక్షసంగా నడుస్తున్నదన్నది మండిపడ్డారు.తెలంగాణకు కేసీఆర్ ఏం చేశారో, రేవంత్ ఏం చేస్తున్నాడో ప్రజలకు స్పష్టంగా అర్థమైందన్నారు. ఆంధ్రా సీఎం చంద్రబాబు 70 శాతం కృష్ణా జాలాలను వాడుకుంటున్నా ఉమ్మడి నల్లగొండ జిల్లా మంత్రులు ఒక్క మాట మాట్లాడడం లేదని విమర్శించారు. తెలంగాణ చంద్రబాబు చేతుల్లోకి పోతున్నదని, బాబు, ప్రధాని మోడీ ఒక్కటై రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్నారని మండిపడ్డారు. అలివి కాని హామీలతో అధికారంలోకి వచ్చి ఏ ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయని కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసిగిపోయి ఉన్నారన్నారు. పూర్తిగా విఫలమైయ్యారని మండిపడ్డారు. కాంగ్రెస్ అంటేనే మోసగాళ్ల పార్టీ అన్నారు.ఇప్పుడు రాష్ట్రంలో ఏ గ్రామ ప్రజలను కదిలించినా కేసీఆర్‌ను ఓడించి తప్పు చేశామని ప్రజలు మదన పడుతున్నారని తెలిపారు. మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం రావాలనే కోరుకుంటున్నారని చెప్పుకొచ్చారు. కేసీఆర్ మాయాంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున్న పెట్టబడులు వచ్చాయని దీంతో తెలంగాణ అభివృద్ధిలో పయనించిదన్నారు. 24 గంటల ఉచిత కరెంట్, రూ.2 వేల ఫించన్, రైతుబంధు, మిషన భగీరథ, కాళేశ్వరం ప్రాజెక్టు, హరితహారం, మిషన్ కాకతీయ వంటి పథకాలు, కార్యక్రమాలకు కేరాఫ్, తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్ కేసీఆర్ అని పేర్కొన్నారు.కేసీఆర్ పెట్టిన బతుకమ్మ చీరలు, రంజాన్ తోఫా, క్రిస్మస్ గిఫ్ట్ ప్యాక్, కేసీఆర్ కిట్, న్యూట్రీషన్ కిట్ బంద్ చేసిన



రేవంత్ పాలన చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. రేవంత్ హైడ్రాతో ఇండ్లు కూల్చడం, హెచ్‌యూలో చెట్లను తొలగించి మూగజీవాలను ఆగం పట్టించడం పనులతో బ్రాండ్ అంబాసిడర్ మారారని ఎద్దేవా చేశారు.కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వచ్చి పాత సమస్యలను సృష్టిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు వస్తే బీఆర్ఎస్ పార్టీదే అధికారమని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు కూడా నిర్వహించలేని స్థితిలో ఉందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించాలని, గ్రామాల్లో చర్చ జరుగాలని సూచించారు. 420 హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిన ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన బాధ్యత ప్రజల తరుపున బీఆర్ఎస్ పార్టీకి ఉందన్నారు.హామీలను విస్మరించి ఢిల్లీకి కప్పం గడుతున్న రేవంత్ సర్కార్‌కు బీఆర్ఎస్ రజతోత్సవ సభ చెంపపెట్టులా మారుతుందని, ప్రజా సమస్యల పరిష్కారానికి వేదిక అవుతుందని తెలిపారు. ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరగనున్న బీఆర్ఎస్ రజోత్సవ సభను పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తమ ఇంట్లో పండుగలా భావించి తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రజతోత్సవ సభ సంబురాలు అంబరాన్నంటాలని పిలుపునిచ్చారు.అనంతరం చందంపేటకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్ర కుమార్, బిల్యా నాయక్, రమావత్ తులసీ రాం నాయక్, వడ్త్యా రమేశ్‌నాయక్, గాజుల అంజనేయులు, పల్లా ప్రవీణ్‌రెడ్డి, బీఎన్‌రెడ్డి, చింతపల్లి సుభాశ్, రమావత్ దస్రూనాయక్, కేసాని లింగారెడ్డి, రాజనేని వెంకటేశ్వర్లు, నియోజకవర్గంలోని వివిధ మండలాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# తుంగపాడు గ్రామంలో 551 పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు



**మిర్యాలగూడ నవభూమి ఏప్రిల్ 17:-** పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంటూ వ్యాధి నివారణకు గాను మిర్యాలగూడ మండలం తుంగపాడు గ్రామంలో గురువారం 551 పశువులకు గాలికుంటూ వ్యాధి టీకాలు వేశారు. కార్యక్రమంలో తుంగపాడు, ఆలగడప వైద్యాధికారులు డాక్టర్ చింత జ్ఞానేశ్వర్ ప్రసాద్, డాక్టర్ నాయిని దుర్గారమాదేవి, వివిఓ ఎండి.నజీర్, జెవిఓలు ఎం.ఏ.జానీపాషా, కృష్ణ, ఎల్ఎస్ఏ శ్రీకాంత్, సుభానా, రమ్య, నాగేందర్, నాగరాజు ఓఎస్ నరసయ్య, నారాయణ శ్యామ్, వాలినియ, శ్రీను, ప్రభాకర్ ,సందీప్, విజయేందర్, అశోక్ ,హరి పాల్గొన్నారు.

# పోషకాహారంతో ఆరోగ్యం



**మిర్యాలగూడ నవభూమి ఏప్రిల్ 17:-** పోషకాహారం తీసుకోవడం వల్లనే ఆరోగ్యంగా ఉండవచ్చుని సూపర్వైజర్ సిహెచ్ పద్మ అన్నారు. పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా గురువారం అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని సీతారాంపురం సెక్టార్ లోని సీతారాంపురం 1-3 అంగన్వాడీ సెంటర్ లో పోషకాహార ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 0-6సం. పిల్లలకు బరువులు, ఎత్తులు తీసి పోషణ స్థితిని గుర్తించి ఆకలి పరీక్ష చేశారు. బరువు తక్కువ ఉన్న పిల్లలకు తగు సూచనలు అందించారు. వయసుకు తగ్గ బరువు, వయసుకు తగ్గ ఎత్తు, ఎత్తుకు తగ్గ బరువు, ఉండాలని గ్రోత్ పర్యవేక్షణ గురించి అవగాహన కల్పించారు. ముర్రుపాలు కచ్చితంగా బిడ్డకు ఇవ్వాలని..6నె. వరకు తల్లిపాలు మాత్రమే 6-24 నెలల వరకు తల్లిపాలు ఇస్తూ అదనపు ఆహారం ఇవ్వాలని వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్స్ చంద్రకళ, శేషు, మని, నాగమణి, విజయ, గౌస్య, నజీమా, షబానా,షాహిన్, మేరాజ్, ఆయా శైలజ, ఏఎన్ఎం సంధ్యారాణి,ఆశా వర్కర్ నాగమణి, ఆర్పిలు లక్ష్మీ ప్రసన్న, ఎస్ఎల్ఎఫ్ అధ్యక్షురాలు మోహనలక్ష్మి, గర్భిణీలు, బాలింతలు, కిషోర్ బాలికలు, తల్లులు పాల్గొన్నారు.

# బీఎస్ఎన్ఎల్ సేవలు మరింత విస్తరించాలి : ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

**రామగిరి, నల్లగొండ ఏప్రిల్ 17 :** ప్రైవేట్ టెలికాం సంస్థలతో పోటీపడుతూ, నూతన ఒరవడిని అందిపుచ్చుకుంటూ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) సేవలు మరింత విస్తరించాలని రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. నల్లగొండ పానగల్ రోడ్డులో ఉన్న బీఎస్ఎన్ఎల్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం జరిగిన టెలికాం సలహా సంఘం సమావేశానికి ఆయన హాజరై సంస్థ పురోభివృద్ధికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ.. మారుమూల ఏజెన్సీ, కొండ ప్రాంతాలకు బీఎస్ఎన్ఎల్ సేవలను విస్తరించాల్సి ఉందన్నారు.మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. వినియోగదారులకు సత్వరమే ఎటువంటి అంతరాయం లేని మెరుగైన సేవలందించేందుకు అధికారులు, ఉద్యోగులు, క్షేత్రస్థాయి సిబ్బంది మరింత కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి, బీఎస్ఎన్ఎల్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ పాశ్యం వెంకటేశ్వర్లు, డిప్యూటీ జనరల్ మేనేజర్ గురువయ్య, అధికారులు రవి ప్రసాద్, మురళీకుమార్ పాల్గొన్నారు.

# మల్లీశ్వరీ ఆత్మహత్యకు కారకులను కఠినంగా శిక్షించాలి

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎంసీపీఐయు నేతలు





**మిర్యాలగూడ నవభూమి ఏప్రిల్ 17:-** ఇటీవల ఆత్మహత్య చేసుకున్న మాదిగ యువతి ధర్మారపు మల్లేశ్వరి కుటుంబాన్ని ఎంసిపిఐయు నాయకులు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంసిపిఐయు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వస్కుల మట్టయ్య మాట్లాడుతూ నిడమనూరు మండలం బొక్కమంతులపాడు గ్రామానికి చెందిన మాదిగ యువతి మల్లేశ్వరి ఆత్మహత్యకు కారకులైన కుక్కల జానారెడ్డి అతనికి సహకరించిన వారిని కఠినంగా శిక్షించాలని, ఎస్సీ ఎస్టీ హత్య రేప్ కేసు నమోదు చేసి శిక్షించాలని ఎంసిపిఐయు పార్టీ నల్లగొండ జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ యువతుల మీద ఇలాంటి సంఘటనలు జరగకుండా పోలీస్ అధికారులు చూడాలని కోరారు. ప్రియుడు చేతిలో మోసపోయి ఆత్మహత్య చేసుకున్న మాదిగ యువతి మల్లేశ్వరి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకొని కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఎంసిపిఐయు జిల్లా సహాయ కార్యదర్శి పోతుగంటి కాశీ రాంబాబు విజయ్ ప్రశాంత్ కోటేష్ పాల్గొన్నారు

# న్యాయవాదిపై దాడికి నిరసనగా కోర్టుల విధులు బహిష్కరించిన న్యాయవాదులు

**మిర్యాలగూడ నవభూమి, ఏప్రిల్ 17:-** న్యాయవాది కిశోర్ పై జరిగిన దాడిని ఖండిస్తూ, నిరసిస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం మిర్యాలగూడలో కోర్టుల విధులను న్యాయవాదులు బహిష్కరించి కోర్టు ముందు మిర్యాలగూడ - కోదాడ రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేతి సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇక నైనా కళ్ళు తెరిచి రోజు రోజుకు లాయర్లపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. ఇటీవల పెరిగిన దాడుల వలన న్యాయవాదులకు రక్షణ కరువైందనే విషయాన్ని గ్రహించి వెంటనే న్యాయ వాదుల పరిరక్షణ చట్టాన్ని తీసుకురావాలని కోరారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ వారు రాష్ట్ర ప్రభుత్వానికి మెమోరాండం ఇచ్చి నిరసన తెలియజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎ.భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సజావుగ కొనుగోళ్లు జరగాలి

## ఎమ్మెల్యే బిఎల్ఆర్







**మిర్యాలగూడ నవభూమి ఏప్రిల్ 17:-** మిర్యాలగూడ మండలం అవంతిపురం వ్యవసాయ మార్కెట్ యార్డును గురువారం మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్, సబ్ కలెక్టర్ ఎం.నారాయన్ అమిత్ సందర్శించారు. మార్కెట్ యార్డు లోని ఐకెపి మార్కెట్ పరిసరాలు పరిశీలించి రైతులతో కలిసి మాట్లాడి ధాన్యం కొనుగోలును పరిశీలించారు, అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ మార్కెట్ కి వచ్చిన రైతుల ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రతిఒక్కరికి సహకరించాలని సూచించారు. అలాగే మార్కెట్లో నూతన గోదామ్ లు ఏర్పాటు పై చర్చించారు. అలాగే శనివారం, మంగళవారం నిర్వహించే సంతకి వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు నాయకులు, బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు..

# ప్రభుత్వం దివ్యాంగుల పట్ల నిర్లక్ష్యం వీడాలి : గోలి ప్రభాకర్

**కట్టంగూర్, ఏప్రిల్ 17 :** ప్రభుత్వం దివ్యాంగుల పట్ల నిర్లక్ష్యం విడనాడి ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ దివ్యాంగ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోలి ప్రభాకర్ అన్నారు. గురువారం నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలంలోని మల్లారం, బొల్లెపల్లి గ్రామాల్లో పర్యటించి దివ్యాంగులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకుని దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 16 నెలలు దాటిన వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులను నిలువున మోసం చేస్తుందని ఆరోపించారు. దివ్యాంగులకు పింఛన్లు పెంచడంతో పాటు రేషన్ కార్డుల ద్వారా 35 కేజీల బియ్యం, ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలని డిమాండ్ చేశారు. దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని లేకపోతే జూన్‌లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నీలమ్మ, సరిత, సత్యనారాయణ, నాగరాజు పాల్గొన్నారు.